

నేడు డయల్ యువర్ డీఎం

భగత్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-1 డిపో పరిధిలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేనేజర్ బి విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్-1 డిపో పరిధిలోని కరీంనగర్, మానకొండూర్, ఇల్లంతకుంట, బెజ్జంకి, జమ్మికుంట మండలాల ప్రయాణికులు ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 8121993780 నంబర్‌కు ఫోన్‌చేసి సమస్యలు, సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

కోతలు లేకుండా నిరంతర విద్యుత్

ఇంటర్వ్యూ
INTERVIEW

- వేసవి సమస్యల పరిష్కారానికి ముందస్తు చర్యలు
- అధికారుల అవినీతి, అలసత్వంపై ఫిర్యాదు చేయండి
- 'గృహజ్యోతి' కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు
- కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు సబ్ స్టేషన్లతో మెరుగైన సరఫరా
- 'ఆంధ్రజ్యోతి'తో ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మేక రమేశ్‌బాబు



ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రమేశ్‌బాబు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'వినియోగదారులకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాం.. వ్యవసాయానికి 24గంటల విద్యుత్‌ను అందిస్తున్నాం. రాత్రి వేళల్లో స్ట్రీట్ లైట్ల కారణంగా లోడ్ అధికమై సింగిల్ ఫేజ్ సరఫరా చేస్తున్నాం. అది కూడా కొంత సమయం మేరకే పరిమితం చేస్తున్నాం. పట్టణ ప్రాంతాల్లో ఇకపై వారానికి రెండు రోజులు కోతలు విధించకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తెస్తున్నాం. విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు మా శాఖ సిబ్బంది 24/7 వినియోగదారులకు అందుబాటులో ఉంటారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట నిర్వహిస్తున్నాం. వేసవిలో వచ్చే విద్యుత్ సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నాం'.. అని ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ) మేక రమేశ్‌బాబు అన్నారు. కొద్ది నెలలుగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువ కావడం, ముందస్తు సమాచారం లేకుండా కోతలు విధించడం, పట్టణ ప్రాంతాల్లో వారంలో రెండేసి రోజులు సరఫరాను నిలిపివేయడం వంటి సమస్యలను వినియోగదారులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ఎస్‌ఈని కలిసి ఆయా అంశాలను ప్రస్తావించింది. విద్యుత్‌శాఖ ఉద్యోగుల అవినీతి, జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయనతో మాట్లాడింది. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ సమగ్ర పాఠం..

ఆంధ్రజ్యోతి : ఇటీవల విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి.. గతంలో పట్టణాల్లో ఒక్క రోజు మాత్రమే మరమ్మతుల కోసం సరఫరా నిలిపివేసేవారు. ప్రస్తుతం రెండు రోజులు విద్యుత్‌సరఫరా ఆపేస్తున్నారు.. వ్యవసాయానికి కూడా 24 గంటల విద్యుత్ రావడం లేదు.. కారణాలేమిటి?

ఎస్‌ఈ : వ్యవసాయానికి 24 గంటలపాటు విద్యుత్‌ను అందిస్తున్నాం.. సాయంత్రం వేళల్లో మాత్రమే స్ట్రీట్ లైట్ల కారణంగా లోడ్ ఎక్కువ అవుతున్నది. అధికారుల ఆదేశాల మేరకు కొంత సమయం మేరకు సింగిల్ ఫేజ్ సరఫరా చేస్తున్నాం. పట్టణ ప్రాంతాల్లో ఇకపైన వారానికి రెండురోజులు కోతలు లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తెస్తున్నాం. పది సబ్ స్టేషన్లతో విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషిచేస్తున్నాం.. ఇకపై విద్యుత్ కోతలనేవి ఉండవు. ఓవర్ లోడ్ ఉన్న చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం. అవసరమైన చోట పాతవాటి సామర్థ్యాన్ని పెంచుతున్నాం. వేసవిలో వచ్చే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఏ కేటగిరిలో ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి?

ఎస్‌ఈ : సర్కిల్ పరిధిలో 3,78,969 గృహ విద్యుత్ కనెక్షన్లు, 1,01,903 వ్యవసాయ కనెక్షన్లు, 6,306 పరిశ్రమల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 5,47,251 విద్యుత్ కనెక్షన్ల ద్వారా వినియోగదారులకు సరఫరాను అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు తరచుగా ఫెయిల్ అవుతున్నాయి. వాటిని రిపేర్ చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో మీ తీసుకుంటున్న చర్యలేమిటి?

ఎస్‌ఈ : జిల్లాలో 22,404 వ్యసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. సంవత్సరం పొడవునా ఒ క్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు షెడ్యూల్ ఖరారు చేసి...

మిగతా 8లో

ఆరోగ్య మహిళపై అవగాహన కల్పించాలి



డాక్టర్లను వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ పమేలా సత్పతి

- వైద్యులు అంకితభావంతో పని చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళ కార్యాక్రమంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. నగరంలోని మొహతాజ్‌ఖానా అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం సందర్శించారు. సెంటర్‌లో నిర్వహిస్తున్న వైద్యపరీక్షలు, పరీక్షలు చేయించుకున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫలితాలు విధిగా నమోదు చేయాలని, గర్భిణులకు ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేయాలని వైద్యాధికారి డాక్టర్ ఇమాన్‌కు సూచించారు. ల్యాబోరేటరిని పరిశీలించారు. అన్ని పరీక్షలు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్, సీబీపీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు. మహిళలు, రక్తహీనతతో బాధపడకుండా పౌష్టికాహారం తీసుకునేలా సిబ్బందితో క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణకు సూచించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో చేసే వైద్య పరీక్షలకు సంబంధించిన బోర్డును ప్రతి ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద 40వేల రూపాయల విలువైన 54రకాల వైద్యపరీక్షలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తామన్నారు. మహిళలు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ సనా, సూపర్‌వైజర్ ఎంకే బేక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



బీజేపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

భగత్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన చరిత్ర కాంగ్రెస్‌పార్టీదేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యనాయ కుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో మాట్లాడిన మాటలను కాంగ్రెస్ పార్టీ పనిగట్టుకుని వక్రీకరించి దుర్మార్గ రాజకీయాలు చేస్తుందన్నారు. భారత రత్న, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ రాసిన రాజ్యాం గానికి తూట్లు పొడిచి దేశంలో కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ తీసుకువచ్చిందన్నారు. అంబేద్కర్‌పై గౌరవం లేకుండా ఆయ నను ఎన్నికల్లో ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనన్నారు. బీజేపీ హయాంలోనే అంబేద్కర్‌కు భారతరత్న వచ్చిందని గుర్తు చేశారు. కేంద్రలోని మోదీ ప్రభుత్వం అంబేద్కర్ ఆలోచన విధానాలు, ఆశయ సాధనకోసం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, వాసాల రమేష్, కళ్లెం వాసుదేవరెడ్డి, ఎర్రబెల్లి సంపత్‌రావు, దుబాల శ్రీనివాస్, కొలగాని శ్రీనివాస్, గుంజేటి శివ, శేఖర్, నాంపల్లి శ్రీనివాస్, అడిచర్లరాజు, సంతోష్, రతన్, అవుదుర్తి శ్రీనివాస్, తనుకు సాయికృష్ణ పాల్గొన్నారు.

నిఘా నేత్రాలను పట్టించుకోరా?

- అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- కీలక సమయాల్లో సాక్ష్యాల సేకరణకు ఇబ్బంది



మంచిర్యాల చౌరస్తాలో కిందకు వాలిన సీసీ కెమెరా



తెలంగాణ చౌక్‌లో కిందకు వేలాడుతున్న సీసీ కెమెరా

కరీంనగర్ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిప సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. సీసీ కెమెరాల నిర్వహణను అధికారులు పట్టించుకోక పోవడంతో కిందకు వేలాడుతన్నాయి. కరీంనగర్‌లోని తెలంగాణచౌక్, మంచిర్యాలచౌక్, ఇతర ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫైబర్ కేబుల్ తెగిపోయాయి. పలుచోట్ల కెమెరాలు కిందకు వాలాయి. ఇలా రకరకాల సమస్యలతో కెమెరాలు పని చేయడం లేదు. రోడ్డు ప్రమాదం లేదా మరో రకమైన ఘటన జరిగినప్పుడు ప్రమాదానికి, ఘటనకు కారణమేంటి? తప్పు ఎవరిది? అనేది పోలీసు అధికారులు తెలుసుకునేందుకు ఈ సీసీ కెమెరాలు చాలా కీలకంగా పనిచేస్తున్నాయి. నగరంలోని పలుచోట్ల నిత్యం వాహనాలు ఢీకొనడం, వాహనాలచోరీ, ఆలయాల్లో హుండీల చోరీ వంటి ఘటనల్లో దర్యాప్తు అధికారులు ఈ సీసీ కెమె రాల పుటేజీలే కీలకంగా పనిచేస్తున్నాయి. చాలా కేసులు, ఘటనల్లో సీసీ కెమెరాల్లో లభించిన వీడి యో రికార్డుల సాక్ష్యాలతోనే వివాదాలు పరిష్కారమవుతున్నాయి. నిందితులను గుర్తించి అరెస్టు చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సీసీ కెమెరాల నిర్వహణను అధికారులు నిర్లక్ష్యం చేయడంతో కీలక సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

- **నిర్వహణను పట్టించుకోకపోవడంతో..**

కరీంనగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్, బ్యాంక్‌లు, కలెక్టరేట్, అన్ని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు పోలీసు స్టేషన్లు, కార్యాలయాలు, ఆసుపత్రులు, వాణిజ్య జముదాయాలు, అపార్ట్‌మెంట్, ఇళ్ళల్లో కూడా వేల సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. మానేరు డ్యాం వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో కొన్ని పోలీసుశాఖ, మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఇతరులు ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్య కూడళ్ల, ఆర్టీసీ బస్టాండ్, పోలీసు ఠాణాలు, కార్యాల యాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసు కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేశారు. వీటిలో చాలా కెమెరాలు పనిచేయడం లేదు. సీసీ కెమెరాలు బిగించిప్పుడు ఉన్న వాటి శ్రద్ధ నిర్వహణలో కనిపించడం లేదనే విమర్శలున్నాయి. సీసీ కెమెరాలు పని చేసేందుకు ఫైబర్ కేబుల్, విద్యుత్ సరఫరా కీలకంగా పనిచేస్తుంది. ఈ రెండు విషయాల్లో నిర్లక్ష్యం వల్లనే సీసీ కెమెరాలు చాలా చోట్ల పనిచేయడం లేదు. కరీంనగర్‌లో స్మార్ట్ సిటీ పనులు జరుగుతున్న సమయాల్లో విద్యుత్ స్తంభాల తొలగింపు, చెట్ల కొట్టివేత, రోడ్లను తవ్విన సందర్భాలలో, భారీ వాహనాలు వచ్చిన సమయాల్లో, తుఫాన్, గాలి వాన సమయాల్లో సీసీ కెమెరాలకు అనుసంధానం చేసిన ఫైబర్ కేబుళ్లు తెగిపోతున్నాయి. అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బర్తరఫ్ చేయాలని సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అమిత్‌షా తన వ్యాఖ్యలతో అంబేద్కర్‌ను అభిమానించే కోట్లాదిమంది దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల మనోభావాలను అవమానపరిచారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మూల సిద్ధాంతంలో భాగమేనని విమర్శించారు. గతంలోనూ అనేకసార్లు కేంద్ర మంత్రులు, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సైతం రిజర్వేషన్లను సమీక్షించాలని, భారత రాజ్యాంగాన్ని మార్చడానికి అధికారంలోకి వచ్చామని అన్నారని తెలిపారు. మొన్నటి ఎన్నికల సమయంలో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని, అంబేద్కర్ ఒక్కరే రాజ్యాంగాన్ని రాయలేదంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమళ్ల శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, నాయకులు సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, అర్ష మల్లేశం, ఆకుల నర్సయ్య, గంట శ్రీనివాస్, కాషెట్టి శీనివాస్, మెండి చంద్రశేఖర్, కుర్ర పోచయ్య, షబానా మహమ్మద్, ముల్కల కవిత, సలీం, జ్యోతిరెడ్డి, రజితారెడ్డి, మెరాజ్, అస్తపురం తిరుమల, మహాలక్ష్మి, శషన్న, అష్రాఫ్, బషీర్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు

- దెబ్బతిన్న ఎలబోతారం-బొమ్మకల్ రోడ్డు
- టిప్పర్లు అతివేగంగా వెళుతుండడంతో ప్రమాదాలు



బొమ్మకల్ శివారులో గుట్టను తవ్వి టిప్పర్‌లో మట్టి పోస్తున్న ఎక్స్‌కవేటర్

సైదాపూర్, డిసెంబరు 19 ఆంధ్రజ్యోతి : ఎలబోతారం-బొమ్మకల్ రోడ్డు పూర్తి తారులేచి కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో ఆగ్రామాల ప్రజలు, వాహన దారులు ఇబ్బందులకు గురవుతున్నారు. నేషనల్ హైవే 563 నిర్మాణానికి కాంట్రాక్టర్ బొమ్మకల్ సమీపంలోని గుట్ట ప్రాంతం నుంచి టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నాడు. నిరంతరాయంగా టిప్పర్లు మట్టిని తరలిస్తుండడంతో రోడ్డు దెబ్బతిని దుమ్ము, ధూళి లేచి రోడ్డు పక్కన ఇళ్లలోకి చేరుతోంది. టిప్పర్లు ఇష్టానుసారంగా నడుస్తుండడంతో ఆ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. బొమ్మకల్ గుట్ట ప్రాంతం నుంచి మట్టిని తరలి స్తున్న టిప్పర్ అతివేగంగా వెళ్తా హుజూరాబాద్ మండలం బోర్నపల్లి మూల మలుపువద్ద బోల్తా. ఆ టిప్పర్‌లోని మట్టి ఆ రోడ్డు పక్కన నడుచు కుంటు వస్తున్న అన్నచెల్లెల్లపై పడింది. ఆ మట్టిలో వారిద్దరు కప్పుకపోయి వారు అక్కడికక్కడే మృతి చెందారు. బొమ్మకల్ శివారులో మట్టిని తరలిస్తుండడంతో గుట్ట మాయమవుతోంది. దీంతో జీవాలు మేపేందుకు ఇబ్బంది అవుతుందని గొల్ల కురుమలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులకు మించి మట్టిని తరలిస్తున్నారనే విమర్శలున్నాయి. మైనింగ్, రెవెన్యూ అధికారులు క్వారీ ప్రాంతాన్ని పరిశీలించి విచారణ ప్రజలు కోరుతున్నారు.

మట్టి అనుమతులు రద్దు చేయాలి



సమయం సందర్భం లేకుండా మట్టి టిప్పర్లు వెళ్తండడంతో గొడిశాల, రాములపల్లి, ఎలబో తారం, బోర్నపల్లి ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. రోడ్లు దెబ్బతిని కంకరతేలాయి. టిప్పర్లు అతివేగంతో వెళుతుండడంతో ప్రమాదాలు జరు గుతున్నాయి. బొమ్మకల్ శివారులో గుట్ట ప్రాం తం నుంచి నేషనల్ హైవే కాంట్రాక్టర్‌కు ఇచ్చిన మట్టి తరలింపు అనుమతులు రద్దు చేయాలి. ఎలబోతారం నుంచి బొమ్మకల్ వరకు రోడ్డును త్వరగా నిర్మించాలి. - గుండేటి వాసుదేవ్, సీపీఎం మండల కార్యదర్శి

జిల్లా స్థాయి కబడ్డీ శిక్షణ శిబిరం ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కబడ్డీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ అమిత్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని కబడ్డీ సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమిత్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కబడ్డీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ఛాంపియన్‌గా నిలిచేందుకు కృషి చేయాలన్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న బాలికలు ఈ నెల 22 నుంచి హైదరాబాద్‌లోని హాకీంపేటలో, బాలురు ఈ నెల 27 నుంచి జనగామలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అనూకర్ రావు, సంపత్‌రావు, మల్లేశ్‌గౌడ్, సునీల్‌రెడ్డి, సుధాకర్, కూన పద్మ, వీరన్న, శ్రీనివాస్, మోహన్, హరికృష్ణ, వర్మ పాల్గొన్నారు.

వృద్ధుడిని నుంచి డబ్బులు అపహరణ

వేములవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఖాతా నుంచి డ్రాచేసిన డబ్బులను లెక్కపెట్టి ఇస్తానని నమ్మబలికి వృద్ధుడి వద్ద నుంచి ఏడువేల రూపాయలు అపహరించిన ఘటన వేములవాడ పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆవరణలో గురువారం జరిగింది. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన గుడిసె మాణిక్యం అనే వృద్ధుడు యూనియన్ బ్యాంక్‌లోని తన ఖాతాలో నుంచి రూ. 20 వేలు డ్రా చేశాడు. వృద్ధుడిని గమనించిన ఓ వ్యక్తి అతనికి మాయమాటలు చెప్పి డబ్బులు మళ్లీ లెక్కిస్తానని తీసుకుని డబ్బులు లెక్కిస్తున్నట్లు నటించి అందులోంచి ఏడు వేల రూపాయలు మాయం చేసి మిగతా సొమ్ము చేతిలో పెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. అనుమానం వచ్చిన వృద్ధుడు మళ్లీ డబ్బులు లెక్కించగా 13 వేల రూపాయలు మాత్రమే ఉండడంతో మోసపోయానని గ్రహించి విషయాన్ని బ్యాంక్ మేనేజర్‌కు తెలిపాడు. బ్యాంక్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. డబ్బులు ఎత్తుకుని వెళ్లిన దొంగ సమీపంలోని ఓ వైన్ షాప్ దగ్గర ఉండడం గమనించిన బ్యాంక్ ఉద్యోగి రాజేష్ అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. చాకచక్యంగా దొంగను పట్టు కొని పోలీసులకు అప్పగించిన రాజేష్‌ను బ్యాంక్ సిబ్బంది అభినందించారు.

సెల్‌టవర్ నిర్మాణం నిలిపివేయాలి

మల్యాల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మల్యాల కొత్తపేట ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ సెల్‌ఫోన్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరుతూ స్థానిక మహిళలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఇళ్ల మధ్య సెల్‌టవర్‌తో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఈవో శ్రీకాంత్‌తో తమ ఆగ్రహం వెలిబుచ్చారు. పనులు నిలిపివేయనున్నట్లు ఈవో తెలుపడంతో మహిళలు వెనుదిరిగారు.

సమస్యలు పరిష్కరించరూ..

- రేషన్ డీలర్లకు అందని గౌరవ వేతనం
- సక్రమంగా జమకాని కమీషన్
- నెలంతా కష్టపడినా ఫలితం ఉండడం లేదని ఆవేదన





హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు సమస్యలతో సతమతమవుతున్నారు. నెల రోజులు కష్టపడితే ఏమీ మిగలడం లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ రేషన్ డీలర్లకు గౌరవ వేతనం కల్పిస్తామని మాటిచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా అది కార్యరూపం దాల్చలేదు.

● మినీ సూపర్ మార్కెట్లుగా...

ఉమ్మడి రాష్ట్రంలో అమ్మహస్తం పథకం అమలు జరిగింది. బియ్యంతో పాటు చక్కెర, పప్పులు, నూనె ఇలా తొమ్మిది నిత్యావసర వస్తువులు రేషన్ షాపు ల్లో ఇచ్చేవారు. ఇది డీలర్లకు కాస్త లాభసాటిగానే ఉండేది. రాష్ట్ర విభజన అనంతరం బీఆర్ఎస్ ప్రభు త్వం వచ్చాక అమ్మహస్తం పథకం నిలిచిపోయింది. కేవలం రేషన్ షాపులు బియ్యం పంపిణీకే పరిమిత మయ్యాయి. తిరిగి నిత్యా వసరల విక్రయం జరి పేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు. రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా మారిస్తే న్యాయం చేసినట్లు అవుతుందంటున్నారు. రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులు ప్రతినెల క్రమంగా అందటం లేదు. రెండు, మూడు నెలలకు కమీషన్ డబ్బులు అకౌంట్లలో జమ అవుతున్నాయి. నెలవారీ డబ్బులు అందకపోవడంతో డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి నెల క్రమంగా డబ్బులు ఇవ్వాలనే డిమాండ్ సైతం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని డీలర్లు వాపోతున్నారు.

● నామమాత్రంగా కమీషన్

ఎంత కష్టం చేసినా చివరకు మిగిలేది రిక్తహస్తాలే అని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. అన్‌లోడింగ్ చార్జీలు సైతం తామే భరించడంవల్ల ఏమీ మిగలడం లేదుంటున్నారు. ఒక్కోసారి తామే అదనంగా భరించాల్సిన దుస్థితి ఏర్పడుతుందనేది డీలర్ల వాదన. ఒక డీలరు వంద క్వింటాళ్ల బియ్యం బస్తాలను తీసుకుంటే రవాణా, డ్రైవర్, కూలీ మొత్తం రెండువేల రూపాయల వరకు భరించాల్సి వస్తోంది. వంద క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయిస్తే క్వింటాల్‌కు 140రూపాయల చొప్పున 14వేల రూపాయల కమిషన్ డీలర్‌కు వస్తుంది. అందులో నుంచి షాపు అద్దె, విద్యుత్ చార్జీలు, హమాలీ ఖర్చులు చెల్లిస్తే ఏమీ మిగలడ లేదని డీలర్లు చెబుతున్నారు. అన్ లోడింగ్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని డీలర్లు డిమాండ్ చేస్తున్నారు. బస్తాకు రెండు కిలోల బియ్యం తక్కువ వస్తున్నాయి. ఈ క్రమంలో ఈ భారాన్ని కూడా మోయాల్సి వస్తోందని డీలర్లు చెబుతున్నారు. క్వింటాల్ బియ్యం బస్తా కచ్చితమైన తూకంతో సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. షాపు రెన్యూవల్ శాశ్వత ప్రతి పాదికన జరగాలని, ప్రతి నెల 1వ తేదీ లోగానే బియ్యం సరఫరా చేయాలని, ప్రభుత్వం రేషన్ షాపుల కోసం భవనాలను నిర్మించి ఇవ్వాలని డీలర్లు కోరుతున్నారు.

● ప్రభుత్వం స్పందిస్తే సమస్యకు పరిష్కారం



డీలర్ల సంఘం అధ్యక్షుడు, హుజూరాబాద్. రేషన్‌షాపు డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. మా సమస్యలపై ప్రభుత్వం మాన వతా దృక్పథంతో స్పందించాలి. గౌరవ వేతనం మూడు వేల రూపాయలు కల్పించాలి. డీలర్ మృతి చెందితే తక్షణమే ఆర్థిక సహయంగా ప్రభుత్వం 30వేల రూపాయలు ఆ కుటుంబానికి అందించాలి. అన్‌లోడింగ్ ఖర్చులు ప్రభుత్వం భరిస్తే మాకు కాస్త వెసులు బాటు ఉంటుంది.

- సొల్లు అశోక్, మండల రేషన్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు, హుజూరాబాద్

తన ఇంటికి దారి ఇవ్వాలని

సెల్‌టవర్ ఎక్కి నిరసన





సెల్‌టవర్ ఎక్కిన మల్లేష్

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి దారి ఇవ్వడంలేదని ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన సంఘటన మండలంలో పందిళ్లలో గురువారం జరిగింది. సమస్య పరిష్కరిస్తామని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ హామీతో కొండపర్తి మల్లేష్ సెల్‌టవర్ నుంచి కిందికి దిగాడు. తమ ఇంటికి వెళ్లడానికి తన అన్న దారి ఇవ్వడంలేదని మనస్తాపం చెందిన మల్లేష్ సెల్‌టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకొని మల్లేష్‌కి నచ్చచెప్పి కిందికి దించే ప్రయత్నం చేశారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సమస్య పరిష్కరిస్తామని ఫోన్‌ద్వారా తెలపడంతో బాధితుడు మల్లేష్ టవర్ పైనుంచి కిందికి దిగాడు.

ఇసుక అక్రమ రవాణపై కొరడా

- ఒకే నంబర్ ప్లేట్‌తో ఇసుక తరలింపు
- మూడు లారీల పట్టివేత

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. లారీలకు ఒకే నంబర్ ప్లేటుతో ఇసుకను తరలించడంపై నిఘా పెట్టారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక లారీలను పట్టుకున్నారు. 24 గంటల్లో సిరిసిల్లలో రెండు, వేములవాడలో ఒక ఇసుక లారీని పట్టుకొని ఐదుగురిపై కేసు నమోదు చేశారు. సిరిసిల్ల పట్టణం కలెక్టరేట్ చౌరస్తా వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా లారీ నంబర్ టీజీ 23 0639కు బదులుగా టీజీ 23టీ 0456 అనే నంబర్ ప్లేట్లు అమర్చి అక్రమంగా ఇసుకను తరలిసున్నారని బహిర్గతమైంది. రెండు లారీల్లో ఒకే నంబర్ ప్లేట్‌పై ఇసుకను అక్రమంగా రవాణా చేయడమే కాకుండా లారీ నంబర్ ప్లేట్లు మార్చిన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ బుద్దుల రాజేందర్(30), లారీ యజమానులైన బోయిన్ పల్లి మండలంలోని నీలోజుపల్లి గ్రామానికి చెందిన ఎర్ర నాగరాజు, కొదురు పాక గ్రామానికి చెందిన రాకం స్వాతిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కెకృష్ణ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మీస జగదీష్(ఫైల్)

సుల్తానాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లూజ్ వైర్లను సరిచేసే యత్నంలో ఓ యువకుడు విద్యుదాఘతానికి గురై మృతిచెందిన సంఘటన సుల్తానాబాద్ మండ లంలోని రేగడిమద్దికుంటలో చోటు చేసుకుంది. రామునిపల్లి గ్రామానికి చెందిన మీస చంద్రయ్య, లక్ష్మీ దంపతులు, కుమారుడు మీస జగదీష్‌లు తమ వ్యవసాయ క్షేత్రంలో కూర గాయలు సాగు చేసుకుంటున్నారు. గురువారం సమీప విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండగా వాటిని సరి చేసే క్రమంలో సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ వైరుకు తాకి జగదీష్(24) విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కిందపడిపోగా కుటుంబ సభ్యులు అతన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్య

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో ఓ మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జంగిలి దేవేంద్ర (27) గురువారం ఇంట్లో భర్త పరశురాములు లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా మానకొండూర్ మండలం శంషాబాద్ గ్రామానికి చెందిన దేవేంద్రకు ఎరడపల్లి గ్రామానికి చెందిన జంగిలి పరశురాములతో 8ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 14 నెలల కూతురు ఉంది. దేవేంద్ర మృతికి సంబంధించి కారణాలు తెలియరాలేదు.

హుజూరాబాద్‌లో ..

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన గంధ రామక్క అనే మహిళ బుధవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా గురువారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గందం రామక్క ఉంటున్న ఇంటిని కొండబత్తిని మురళి జప్తు చేస్తాడమోనన్న మనోవేదనకు గురై ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో చీరెతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తన భార్య మృతికి కొండ బత్తిని మురళి, అంకుసులే కారణమంటూ మృతురాలి భర్త సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామ శివారులోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన ఎనమిది మంది ట్రాలీ ఆటోలో వేములవాడ దైవదర్శనానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వంకాయగూడెం వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీ ఆటో ట్రాలీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న ఆనంద్ వర్ధన్, సూర్యప్రకాష్, ఇషాని అనే ముగ్గురు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వాహనాల చోరీ కేసులో ఏడాది జైలు

వేములవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను దొంగలించిన కేసులో ఇద్దరు వ్యక్తులకు వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి ఏడాది జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. వేములవాడ పట్టణానికి చిట్టిమల్ల అంజయ్య, జగిత్యాలకు చెందిన ఉబిది గంగస్వామి తమ ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయని గత జూన్ నెలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణ జరిపి దొంగతనానికి పాల్పడిన చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన షైక్ మహబూబ్, బొప్పాపూర్‌కు చెందిన అనరసి కిష్టయ్య అనే నిందితులను పట్టుకొని రిమాండ్ తరలించామని సీఐ వివరించారు. విచారణ అధికారి అంజయ్య కోర్టులో చార్జీ షీటు దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేశ్ సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున విక్రాంత్ కేసును వాదించారని, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరస్తులకు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించిందని సీఐ తెలిపారు.

జనరల్ ఆసుపత్రి సూపరెండెంట్ సరెండర్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

జగిత్యాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ రాములును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు సరెండర్ చేస్తూ గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రి సూపరెండెంట్ రాములు ఎటువంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరుకావడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చర్యలు చేపట్టారు. జనరల్ ఆసుపత్రిలో 9 తొమ్మిది జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించగా, కేవలం మూడు సమావేశాలకు హాజరయ్యారని, ఆరు పర్యాయాలు జడ్పీ జనరల్ బాడీ సమావేశాలకు గైర్హాజరైనట్లు గుర్తించారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచడంలో నిర్లక్ష్యం వహించడం, మాతా శిశు కేంద్రంలో ఆహార పదార్థాల కాంట్రాక్టులో అవకతవకలకు పాల్పడడం, గత నెలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించిన సమయంలో సూపరింటెండెంట్ రాములు సెలవు మంజూరుకాకుండానే గైర్హాజరైనట్లు గుర్తించడం, నిజామాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్న నేపథ్యంలో డీఎంఈకి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పాఠశాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచండి

● కలెక్టర్ సత్యప్రసాద్



పెద్దాపూర్ గురుకులంలో పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 19 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాల పరిసర ప్రాంతాల్లో పాములు, పురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో మళ్లీ పాము కాటు కలకలం రేపడంతో విషయం తెలుసుకున్న కలెక్టర్ గురువారం పాఠశాలలో పర్యటించారు. బుధవారం రాత్రి గురుకులంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఓంకారి అఖిల్ పాము కాటుకు గురికాగా మరో విద్యార్థి బోడ యశ్వంత్ గురువారం ఉదయం అస్వస్థతకు గురయ్యాడు. ఇద్దరిని కోరుట్ల ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఇద్దరు విద్యార్థులు కోరుట్ల పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ అస్వస్థతకు గురైన విద్యార్థులను పరిశీలించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం గురుకుల పరిసరాలు, విద్యార్థులు పడుకునే బెడ్‌లు, తరగదులు, మరుగుదొడ్లు క్షుణంగా ఆర్డీవో శ్రీనివాస్‌తో పాటు అధికారులతో కలిసి పరిశీలించారు. యశ్వంత్ పాము కాటుకు గురయ్యాడా లేదా ఏదైనా విషకీటకం కుట్టిందా అనేది మెడికల్ కాలేజి వారితో మాట్లాడి వివరాలను సేకరిస్తామన్నారు. కాగా వైద్యులు పరిశీలించి పాము కాదని నిర్ధారించి చికిత్స అందించారు. డిప్యూటీ డీఎం హెచ్‌వో శ్రీనివాస్, మెడికల్ వైద్యాధికారి అంజిత్‌రెడ్డిలు యశ్వంత్‌ను పరిశీలించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అధికారుల వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, డీఎస్పీ రాము లు, పోలీసు, వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలను మరో చోటికి తరలించండి

● జాతీయ రహదారిపై తల్లిదండ్రుల ఆందోళన

పెద్దాపూర్ గురుకుల కళాశాల, పాఠశాలను మరో చోటికి తరలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. గురువారం గురుకుల సమీపం లోని జాతీయ రహదారిపై బైఠాయించి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని ఐదు గంటలకు పైగా ఆందోళన చేపట్టారు. కలెక్టర్ వచ్చి పాఠశాలను మరో చోటికి తరలిస్తామని హామీ ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి వెళ్లమని బైఠాయించారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ రాములు సంఘటన స్థలంకు చేరుకుని సర్ది చేప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. సంఘటన స్థలానికి అడిషనల్ కలెక్టర్ లత వచ్చి విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

పెద్దాపూర్ గురుకులంలో మరో విద్యార్థికి అస్వస్థత

మెట్‌పల్లి రూరల్/కోరుట్ల, డిసెంబర్, 19 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి బోడ యశ్వంత్ గురువారం అస్వస్థతకు గురయ్యాడు. యశ్వంత్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం స్నానం చేస్తుండగా చేయి నొప్పిగా ఉందని అక్కడే ఉన్న తోటి విద్యార్థులకు తెలిపాడు. దీంతో వారు వెంటనే పాఠశాల సిబ్బందికి తెలుపడంతో చికిత్స నిమిత్తం యశ్వంత్‌ను కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి యాంటీవీనమ్ ఇంజక్షన్ ఇచ్చి వైద్యం అందిస్తున్నారు.

● బుధవారం రాత్రి, గురువారం ఉదయం అస్వస్థతకు గురైన ఓంకార్ అకిల్, బోడ యశ్వంత్‌లు కోరుట్ల పట్టణంలో ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పొందుతుండగా కలెక్టర్ సత్యప్రసాద్ వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్

గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్ మాధవిలతను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకరోజు వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైన సమయంలో విద్యార్థులను ఆసుపత్రికి తరలించడంలో, విద్యార్థుల తల్లిదండ్రులతో వ్యవహరించిన తీరు, జరిగిన ఘటనల గురించి ఉన్నతాధికారులకు తెలపడంలో విచారణ చేపట్టారు. గురుకుల ఆవరణలో పారిశుద్య నిర్వహణలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారనే తెలుపుతూ సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారని అధికారులు తెలిపారు.

మత్స్యకారుల వలకు చిక్కిన కొండచిలువ



అర్కండ్లలో వలలో చిక్కిన కొండచిలువ

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామ వాగులో మత్స్యకారులు గురువారం చేపల కోసం వేసిన వలలో కొండచిలువ చిక్కింది. ఈ సందర్భంగా చేపల కోసం మత్స్యకారులు వలలు వేసి బయటకు తీయగా అందులో కొండ చిలువ చిక్కుకొని ఉంది. దాంతో కొండచిలువను బయటకు తీసి తాడుతో లాగి సమీపంలో ఉన్న చెట్ల పొదల్లో వదిలేశారు.

వ్యాన్ ఢీకొని విద్యార్థిని మృతి



బొల్లి మహి(ఫైల్)

చిగురుమామిడి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్కూలు నుంచి తన అక్కతో కలసి ఇంటి వస్తున్న చెల్లెలు ఇంటి సమీపంలో పాల వ్యాను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినది. చిగురుమామిడి ఎస్ఐ రాజేశ్ తెలిపిన కథనం ప్రకారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన బొల్ల మహి(7) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతుంది. సాయంత్రం తన అక్క అమూల్యతో కలిసి స్కూలు నుంచి ఇంటికి వస్తుండా పాల వ్యాన్ వెనకనుంచి వచ్చి ఢీకొనడంతో మహి అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి కూతురుని పట్టుకొని విలపిస్తున్న తీరు కంటతడి పెట్టించింది. మహి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

గోదావరిఖనిలో వైద్యుడి ఐపీ పిటిషన్

- ఇద్దరు వైద్యులతో పాటు 15మందికి నోటీసులు - అదే బాటలో నలుగురు వ్యాపారులు

కోల్‌సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన ప్రముఖ వైద్యుడు ఐపీ పిటీషన్ దాఖలు చేసినట్టు సమాచారం. ఇద్దరు వైద్యులతో పాటు మొత్తం 15మందికి నోటీసులు పంపారు. గోదావరిఖనికి చెందిన ఒక కాంట్రాక్టర్, పలువురు వ్యాపారులు సదరు వైద్యుడితో ఆర్థిక లావాదేవీలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఐపీ నోటీసులు కలకలం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా వైద్యవర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా గోదావరిఖనికి చెందిన పలువురు వ్యాపారులు కూడా ఇదే బాటలో ఉన్నట్టు తెలుస్తున్నది. కొందరు పిటిషన్లు దాఖలు చేయగా మరో నలుగురు పిటిషన్లు వేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం.

యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

ఇల్లంతకుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట గ్రామపంచాయితీ పరిధిలోని ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన రెడ్డవేని ప్రశాంత్ (25) అనే యువకుడు ఆన్‌లైన్‌లో క్రిమిసంహారక మందును తెప్పించుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన రెడ్డవేని ప్రశాంత్ అనే యువకుడు కొద్ది సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రికి వెళ్లగా ఆపరేషన్ చేసినా తరుచూ కడుపునొప్పి వస్తుండేది. ప్రశాంత్ ఇటీవల దేశంలోని పలు జ్యోతిర్లింగాలను దర్శించుకొని ఇంటికి వచ్చాడు. గ్రామంలోని వారందిరికీ ఏ వస్తువులు కావాలన్నా ఆన్‌లైన్‌లో బుక్‌చేసే ప్రశాంత్ క్రిమిసంహారక మందును కూడా బుక్ చేశాడు. ఈ నెల 13న అర్ధరాత్రి వ్యవసాయ పొలం వద్ద క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన అనవేన కృష్ణమూర్తి(65) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం కృష్ణమూర్తి భార్య క్యాన్సర్‌తో 13 ఏళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. పెయింటింగ్ వర్క్ చేసే కృష్ణమూర్తి మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు పలుమార్లు మద్యం మానివేయాలని మందలించారు. ఒంటరిగా ఉంటున్న కృష్ణమూర్తి మానసికంగా కుంగిపోయాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం ఇంటి పైకప్పు రాడ్‌కు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సంపత్‌కుమార్ తండ్రి కోసం ఇంటికి వచ్చి చూడగా ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. సంపత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య మందలించిందని ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి



నర్సయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని భార్య మందలించడంతో మనస్తాపం చెందిన భర్త దొమ్మాటి నర్సయ్య(45) ఈ నెల 10న ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో జరిగింది. నర్సయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 10న మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న నర్సయ్యను భార్య పద్మ మందలించింది. మనస్తాపం చెందిన నర్సయ్య గదిలోకి వెళ్లి దూలానికి ఉరి వేసుకున్నాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలోని సాయినగర్‌లో బుధవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంటిలో దుండగులు చొరబడి వెండి ఆభరణాలతో పాటు నగదు ఎత్తుకుపోయారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. బొమ్మకల్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బంగారి సదానందం బుధవారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన 20 వేల నగదుతో పాటు 40 తులాల వెండి చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అసెంబ్లీలో మన నేతలు

ప్రాజెక్టుల్లో నీటిని నింపండి

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాజెక్టుల్లో ముందస్తుగా నీటిని నింపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టులకు ఈనెల ఆఖరు వరకు సాగునీరు అందించాలన్నారు. తద్వారా నియోజకవర్గంలోని మల్కపేట, ఫాజుల్‌నగర్, చందుర్తి, జోగాపూర్ చెరువులను నీటితో నింపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్యాకేజ్-9లోని మల్కపేట రిజర్వాయర్‌లో ఇదివరకే ఒక్క టీఎంసీ నీరు ఉందని, మరో టీఎంసీ నీటిని నింపే ప్రక్రియ చేపట్టాలన్నారు. తద్వారా వేములవాడ నియోజకవర్గంలోని రైతాంగానికి లబ్ధి చేకూర్చాలని కోరారు. కలికోట సూరమ్మ రిజర్వాయర్ పనులు ఇప్పటికే ముమ్మరంగా కొనసాగుతున్నాయని, కుడి, ఎడమ కాలువల పనులు ప్రారంభం కావాల్సి ఉందని, ఇందుకోసం ఇటీవల జిల్లా కలెక్టర్ భూ సేకరణకు పబ్లిక్ నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. కుడి, ఎడమ కాలువల నష్టపరిహారం చెల్లించి, బొమ్మెన ప్రాజెక్టుకు నిధులను విడుదల చేయాల్సిందిగా మంత్రిని కోరారు. దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే మల్కపేట రిజర్వాయర్ నీటితో నింపి, నష్టపరిహారం కోసం నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

దళితుల అసైన్డ్ భూములను అప్పగించాలి

- ధరణి సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



కరీంనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో హరితహారం, క్రీడా ప్రాంగణాలు, శ్మశాన వాటికల కోసం దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములను తీసుకుందని, తిరిగి ఆ భూములను వారికి పంపిణీ చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ పేద దళితులకు కేటాయించిన భూములను ప్రజా అవసరాల పేరుతో ప్రభుత్వం తీసుకోవడంతో దళితులకు అన్యాయం జరిగిందన్నారు. దళితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం స్పందించాలని కోరారు. మానకొండూర్ నియోజకవర్గంలోని గన్నేరువరం మండలం చొక్కారావుపల్లి రైతులకు ధరణిలో జరిగిన అన్యాయాన్ని సవరించాలన్నారు. చొక్కారావుపల్లిలో రైతులు 1958 నుంచి పట్టాలు కలిగి ఉన్నారన్నారు. రైతులకు సంబంధించి 163 ఎకరాల పట్టా భూములు కాగా, ధరణిలో 153 ఎకరాలను మాత్రమే చూపించారన్నారు. ధరణిలో జరిగిన తప్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారని అసెంబ్లీలో వివరించారు. ప్రభుత్వం ధరణిలో జరిగిన తప్పులను వెంటనే సవరించి చొక్కారావుపల్లె రైతులకు న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రిని కవ్వంపల్లి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వస్తున్న భూమాతను ధరణిలా తప్పులతో కాకుండా చూడాలని కవ్వంపల్లి విన్నవించారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి



మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు ఐలేని కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కార్యనిర్వాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పీఆర్టీయూ ఆవిర్భవించిందన్నారు. ఈనెల 31లోపు 317 జీవోకు సంబంధించిన స్పౌజ్, మెడికల్, పరస్పర బదిలీల ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన సంఘం పీఆర్టీయూ అని అన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డి, ముస్కు తిరుపతిరెడ్డి, జాలి రాఘవరెడ్డి, జాలి మహేందర్‌రెడ్డి, పాకాల ప్రభాకర్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న కూడా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని సీఎం రేవంత్‌రెడ్డి నియమించకపోవడంతో విద్యారంగ సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారని వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుందని ప్రజా విజయోత్సవాలను జరుపుకోవడం కాదని, విద్యాశాఖ మంత్రిని నియమించి రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కారించాలని కోరారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారని పెంచిన మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి మాల్లారపు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్, కుర్ర రాకేష్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుపై కేసు నమోదు

ఓదెల, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర శివారులోని మల్లికార్జున రైస్ మిల్లుపై గురువారం కేసు నమోదు చేసినట్లు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని డిటిసిఎస్, సిఎస్ఐ అధికారులు తెలిపారు. రైస్ మిల్లులో డీటీసీఎస్ సీఎస్ఐ అధికారులు తనిఖీలు నిర్వహించగా, ప్రభుత్వం ఇచ్చిన వరి ధాన్యం 33,063.81 బదులుగా మిల్లు యజమాన్యం ఇవ్వవలసిన సీఎంఆర్ ధాన్యం 22,152.81 క్వింటాళ్లు కాగా, ఇందులో 32,636.31 క్వింటాళ్ల ధాన్యం తేడా వచ్చిందని తెలిపారు. ఈ మేరకు తెలంగాణ కస్టమ్స్ బిల్లింగ్ ఆర్డర్ 2015 ప్రకారంగా ఓదెల మల్లికార్జున రా రైస్ మిల్ పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

గృహ నిర్మాణదారులకు ఊరట..!

● తగ్గిన సిమెంట్, ఐరన్ ధరలు



సిమెంట్ బస్తాలు | ఐరన్ | హుజూరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ఇల్లు

హుజూరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కట్టుకోవాలంటే సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో భారం. ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు ఎక్కువగా ఉండటంతో చాలా మంది గృహ నిర్మాణాలను వాయిదా వేస్తూ వస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు మొదలు పెట్టాలంటే భయపడుతున్నారు. కూలీ రేట్లు, నిర్మాణ వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుత్తు గృహనిర్మాణం చేసుకునేవారికి అనుకూలమైన సమయంగా చెపుతున్నారు. ఎందుకంటే సిమెంట్, ఐరన్ ధరలు భారీగా తగ్గాయి. ఇటీవల కాలంలో మున్సిపాలిటీలలో గృహ నిర్మాణాల కోసం ప్లాట్లు కొనుగోలు చేసిన చాలా మంది నిర్మాణంపై వేచి చూస్తున్నారు. ఇల్లు నిర్మాణం చేయాలంటే సిమెంట్, ఐరన్ ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. మూడు నెలల క్రితం సిమెంట్ బస్తాకు రూ. 360-370 వరకు ధర ఉండగా, ఐరన్ క్వింటాల్‌కు రూ. 7,500 ధర ఉండేది. ఈ ధరలను చూసి చాలా మంది నిర్మాణాలు చేపట్టాలంటే జంకేవారు. ప్రస్తుతం సిమెంట్ బస్తాకు 50రూపాయలు, ఐరన్ క్వింటాల్‌కు 600ల నుంచి 700 రూపాయల వరకు దిగింది. దీంతో గృహ నిర్మాణాలు పెరిగే అవకాశం ఉంది. ఈ ధరలు మరో నెల రోజుల్లో పెరుగుతాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇంటికి వేసుకునే రంగుల ధరలు కూడా తగ్గినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. డిసెంబరు నుంచి జూన్ వరకు నిర్మాణాలకు అనుకూలంగా ఉండటంతో పాటు నిర్మాణ సామగ్రి ధరలు తగ్గడంతో ఇళ్లు కట్టుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపే అవకాశం ఉంది.

● సిమెంట్, ఐరన్ ధరలు తగ్గాయి.



సిమెంట్, ఐరన్ ధరలు తగ్గడంతో ఇల్లు నిర్మాణం చేపడుతున్నాను. గతంలో ఎక్కువ ధరలు ఉండ డంతో నిర్మాణం చేపట్టలేదు. సిమెంట్ బస్తాకు రూ. 50, క్వింటాల్ ఐరన్‌కు రూ. 700 ధరలు తగ్గాయి. మళ్లీ ధరలు పెరుగుతాయనే ఉద్దేశ్యంతో ఇల్లు నిర్మాణం చేపడుతున్నాను.

- పోగు శ్రీనివాస్, గృహ నిర్మాణదారుడు, హుజూరాబాద్

● ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి



సిమెంట్, ఐరన్ ధరలు తగ్గాయి. మూడు నెలల క్రితం సిమెంట్, ఐరన్ ధరలు ఎక్కువగా ఉండేది. అధిక ధరలు ఉండడంతో ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. ఇప్పుడిప్పుడే సిమెంట్, ఐరన్ ధరలు తగ్గడంతో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు.

- దండ శ్రీనివాస్, సిమెంట్ వ్యాపారి, హుజూరాబాద్

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధి కార సంస్థ ఆదేశాల మేరకు సీఎం కప్-2024 వాలీబాల్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలను సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో శనివారం నిర్వహిస్తున్నామని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి మహిళ, పురుషుల జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల జట్లలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల ఎంపిక చేసి ఉమ్మడి కరీంనగర్ జట్టు నుంచి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాల యం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. ధర్మపురిలోని ఎస్ఎల్ఎన్ఎస్‌ఏ కళాశాలలో ఒకరు, జగిత్యాల నలంద డిగ్రీ కళాశాల జగిత్యాలలో మరొకరు డీబార్ అయ్యారన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన వీసీ

గణేశ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల సెంటర్లను గురువారం వీసీ ఉమేష్ కుమార్ సందర్శించారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో ఒక్కరికే ఎనిమిది ఓట్లు

● వందల సంఖ్యలో డబుల్, ఆపై ఎంట్రీలు ● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో ఒక్కరికే ఎనిమిది చోట్ల ఓటు హక్కు కల్పించారని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. గురువారం కరీంనగర్‌లో ఆయన విలేకరుల మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో వందల సంఖ్యలో ఒక్కో వ్యక్తికి వేర్వేరు చోట్ల ఓటు హక్కు కల్పిస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను రూపొందించారన్నారు. ఓటరు జాబితాను ఆధార్‌కార్డుతో లింక్ చేస్తే పారదర్శకంగా ఉండేదని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేస్తున్న కొందరు అభ్యర్థులు వేలల్లో ఓటరు నమోదు చేయించామని చెప్పడంతో తాను ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించగా 24 గంటల్లో 200కు పైగా డబుల్, ట్రిపుల్ నుంచి ఎనిమిది చోట్ల ఒకే అభ్యర్థి పేరు ఉన్నట్లు గుర్తించానని చెప్పారు. జాబితాలో శ్రీనివాస్, సంపత్ లాంటి పేర్లు ఎక్కువగా ఉండగా, వారి తండ్రిపేరు, వయసు, చిరునామా, ఆధార్ నంబర్ ఒకటే ఉందన్నారు. ఒకే వ్యక్తికి ఇన్ని చోట్ల ఎలా ఓటు వచ్చిందని ఆశ్చర్యం వేసి కలెక్టర్ దృష్టికి, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకొని ఆధారాలను జత చేసి ఫిర్యాదు కూడా చేస్తున్నానని రవీందర్‌సింగ్ తెలిపారు. దీనిపై ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా జనవరి 1న ఎమ్మెల్సీ ఓటరు తుది జాబితా వెల్లడించనున్నందున ఇప్పటి వరకు రూపొందించిన జాబితాను పునఃపరిశీలన చేసి ఒకరికి ఒకే ఓటు ఉండేలా చూడాలని రవీందర్‌సింగ్ కోరారు. ఈసమావేశంలో నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, కెమసారపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక



వాలీబాల్ పోటీలకు ఎంపికైన అఖిల్, మధుసూదన్

వేములవాడ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రహారం డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న అఖిల్, మధుసూదన్ అనే ఇద్దరు విద్యార్థులు శాతవాహన విశ్వవిద్యాలయం వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కేరళలో నిర్వహించే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌రావు తెలిపారు.

రామగుండంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం పర్యటన

కోల్‌సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) బృందం గురువారం రామగుండం ప్రాంతంలో పర్యటించింది. గత రెండేళ్లుగా గోదావరి వరద ముంపునకు గురైన మల్యాపూర్, సప్తగిరికాలనీ, హెడ్‌వర్క్స్ ఏరియా, పుష్కరఘాట్లు తదితర ప్రాంతాలను పర్యటించింది. రామగుండం రెవెన్యూ అధికారులు వరద ముంపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలను ఎన్‌డీఆర్ఎఫ్ బృందానికి చూపారు. గోదావరినదికి రెండేళ్ల క్రితం భారీ వరదలు వచ్చి సింగరేణి హెడ్‌వర్క్స్ వద్ద ఉద్యోగులు చిక్కుకున్న సమయంలో ప్రమాదకరమైన వరద సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం వారిని రక్షించింది. దీంతో వరద ముంపు ఏ విధంగా గురవుతుందని, గోదావరి వరద నీరు ఎలా చొచ్చుకు వస్తుందనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం సప్తగిరికాలనీలో వరదలు, ఇతర విపత్తులు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన సహాయ చర్యలపై నగరపాలక సంస్థ పారిశుధ్య, తాగునీటి సరఫరా తదితర విభాగాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ విజయవాడ కమాండెంట్ ఐఎస్ఎస్ఎఫ్ బబ్లు బిశ్వాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, కార్పొరేషన్ ఏసీపీ శ్రీధర్ ప్రసాద్, ఈఈ రామన్, ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



గోదావరి తీరంలో పరిశీలన జరుపుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం



డీటీసీని కలిసిన ఏఎంవీలు

డీటీసీని కలిసిన నూతన ఏఎంవీఐలు

తిమ్మాపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ద్వారా ఎంపికై రాష్ట్ర రవాణా శాఖలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నూతనంగా విధులు చేపట్టిన ఆరుగురు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గురువారం మండలంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డీటీసీ పురుషోత్తంను మర్యాద పూర్వకంగా కలిశారు. కరీంనగర్ జిల్లాకు హరిత యాదవ్, పెద్దపల్లి జిల్లాకు వంశీకృష్ణ, నిఖిల్ కుమార్, రామగుండం ప్రదీప్ సాగర్, రాజన్న సిరిసిల్లకు పృథ్వీరాజ్ వర్మ, జగిత్యాల జిల్లాకు షేక్ రియాజ్‌లను నియమిస్తూ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కే.సురేంద్ర మోహన్ ఉత్తర్వులు జారీచేయగా వారు ఈ నెల 16న ఉద్యోగాల్లో చేరారు. ఈ సందర్భంగా గురువారం డీటీసీ పురుషోత్తంను మర్యాద పూర్వకంగా కలిశారు.

పేరిణి, కూచిపూడిలో ఖని కళాకారుడి ప్రతిభ

● జాతీయస్థాయిలో ప్రదర్శనలు ● పలు అవార్డులు సొంతం



సిలికానాంధ్ర కూచిపూడి నృత్య బృందంలో నాగరాజు



అవార్డు అందుకుంటున్న నాగరాజు

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒగ్గు కథ కళాకారుడైన తండ్రి స్ఫూర్తితో తాను కూడా కళాకారుడిని కావాలనుకున్నాడు.. తల్లిదండ్రులు, గురువు ప్రోత్సాహంతో పేరిణి, కూచిపూడి నృత్య కళాకారుడిగా రాణిస్తూ జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చాడు.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సప్తగిరికాలనీకి చెందిన కొట్టె నాగరాజు పేరిణి, కూచిపూడి నృత్య కళల్లో తన అద్భుత ప్రదర్శనతో ప్రసంశలందుకుంటున్నాడు. నాగరాజు తల్లి లక్ష్మి, తండ్రి రాములు. ఒగ్గుకథ కళాకారుడిగా రాములు సుపరిచితుడు. తండ్రి ఒగ్గుకథ కళాకారుడు కావడంతో నాగరాజుకు కళలపై ఆసక్తి పెరిగింది. దీంతో తల్లిదండ్రులు నాట్యగురువు జక్కు కృష్ణ వద్ద శిక్షణ ఇప్పించారు. అనంతరం నాగరాజు హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో పేరిణి, కూచిపూడి నృత్యంలో డిప్లొమా పూర్తిచేశారు. నాగరాజు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి పలు అవార్డులు అందుకున్నారు. 2012 సంవత్సరంలో సిలికాన్ ఆంధ్ర నిర్వహించిన కూచిపూడి బృంద నృత్యంలో పాల్గొని గిన్నిస్‌వరల్డ్ రికార్డు అందుకున్నారు. నాగరాజు ఇప్పటి వరకు 200పైగా ప్రదర్శనలు ఇచ్చారు. నాట్య ప్రవీణ, నాట్యరత్న, నాట్య కళాబ్రహ్మ అవార్డులు అందుకున్నారు. తాను నేర్చుకున్న విద్యను పదిమందికి శిక్షణ ఇవ్వాలన్న సంకల్పంతో స్నేహ ఆర్ట్స్ అకాడమీ, రుద్ర డ్యాన్స్ అకాడమీని ఏర్పాటు చేసి పలువురికి కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు.

● పేరిణి నాట్యాన్ని అంతర్జాతీయస్థాయిలో ప్రదర్శించాలి : కొట్టె నాగరాజు




తెలంగాణ రాష్ట్ర కళానృత్యం పేరిణి నాట్యాన్ని అందరికి తెలియజేసి చిన్నారులను కళాకారులుగా తీర్చిదిద్దాలని అకాడమీ ఏర్పాటు చేశా. పేరిణి శివతాండవాన్ని, కూచిపూడి నృత్యం అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించాలని కోరిక.

కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ హుండీ లెక్కింపు

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి దేవాలయ హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ పరిశీలకులు సత్యనారాయణ సమక్షంలో 8నెలల హుండీ లెక్కించగా, రూ. 1,44,144 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పుగల మల్లారెడ్డి, ఆలయ ఈవో సుధాకర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎంపిక



రాహుల్

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 19(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ మామిడి రాహుల్ ఎంపికయ్యాడు. జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌తో పాటు మరుసటి రోజు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారిక నివాసంలో నిర్వహించే ఎట్‌హోం కార్యక్ర మంలో రాహుల్ పాల్గొననున్నాడు. గురు వారం కళాశాల ఆవరణలో జరిగిన కార్య క్రమంలో రాహుల్‌ను ప్రిన్సిపాల్ జైశంకర్ ఓజా, ఎన్ఎస్ఎస్ పీవో సాంబశివరావు, డాక్టర్ ఎం.నరేష్, డాక్టర్ కిరణ్మయిఅభినందించారు.

నేడు, రేపు మంచినీటి సరఫరాకు అంతరాయం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భగత్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో పైపులైన్ లీకేజీ పనులు చేపడుతున్నందున శుక్ర, శనివారాల్లో ఆ రిజర్వాయర్ పరిధిలో మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఎస్ఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రిజర్వాయర్ పరిధిలోని 13, 33, 34, 35, 51, 52, 53, 54 డివిజన్లలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని కోరారు.

క్రాస్‌కంట్రీ పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సమీపంలోని మానేరు నది ఆనకట్టపై గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలకు 80 మంది హాజరయ్యారు. ఈ పోటీలను మానేరు లేక్ సబ్ ఇన్‌స్పెక్టర్ కొమ్మ రాజు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి పాల్గొన్నారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇవ్వాలి

గణేశ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇవ్వాలని శాతవాహన జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య గురువారం శాతవాహన వీసీ ఉమేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నైతం మహేష్,బోడకుంట రమేష్ కొక్కుల వెంకటేష్,సాయి, సాయికృష్ణ పాల్గొన్నారు.

అయ్యప్ప పడి పూజ

భగత్‌నగర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని రేకుర్తి సాయి మహాలక్ష్మిగార్డెన్స్‌లో బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడిబాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జాడి కౌసల్యభూమయ్య జాడి సుజాతబాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో అద్విత విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సీఎంకప్ వివిధ పోటీల్లో జిల్లా కేంద్రంలోని అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి పలు అంశాల్లో విజయాలను సాధించారు. పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్ 60 మీటర్లు, 200 మీటర్ల బాలికల విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాలను సుభిక్ష కైవసం చేసుకుంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ పాలక వర్గం కృషి చేస్తుందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని 14వ డివిజన్ టెలిఫోన్ క్వార్టర్స్ సమీపంలో రూ.16.50 లక్షల నిధులతో సీసీ రోడ్డు, ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైపులైను పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం కార్పొరేషన్‌లో విలీనం చేసిన గ్రామాల డివిజన్లలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి చేశామన్నారు. అయినా కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి జరుగలేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి డివిజన్‌కు ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరారు. 14వ డివిజన్‌లో కార్పొరేటర్ దిండిగాల మహేశ్ కోరిక మేరకు అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

నెలాఖరులోగా మల్టీపర్పస్ పార్కు ప్రారంభిస్తాం

కరీంనగర్ టౌన్: మల్టీపర్పస్ పార్కును నెలాఖరులోగా ప్రారంభిస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్‌తో కలిసి ఆయన పార్కును సందర్శించి పనుల ప్రగతిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 కోట్ల నిధులతో మల్టీపర్పస్ పార్కును సుందరీకరించామన్నారు. పార్కులో పర్యటించి డిజైన్ ప్రకారం అభివృద్ధి చేసిన పనులను పరిశీలించారు. పార్కును ప్రారంభోత్సవానికి సిద్ధం చేసి డిసెంబర్ 24 వరకు నగరపాలక సంస్థకు అప్పగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పార్కు ఎంట్రెన్స్‌లో టికెటింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు వాల రమణరావు, కంసాల శ్రీనివాస్, అఖిల్ ఫిరోజ్, తుల రాజేశ్వరి బాలయ్య, సుధగోని మాధవి కృష్ణ గౌడ్, ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ యాదగిరి, డీఈ అయూబ్ ఖాన్, ఏఈ గఫర్, ఆర్వీ టీం లీడర్ సందీప్, ఏజెన్సీ కాంట్రాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కాలనీగా హౌజింగ్‌బోర్డు

కరీంనగర్ టౌన్: హౌజింగ్‌బోర్డుకాలనీని మోడల్ కాలనీగా తీర్చిదిద్దామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం రాత్రి హౌజింగ్‌బోర్డుకాలనీలో 425 స్ట్రీట్ లైట్లను కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్‌తో కలిసి స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు ప్యాకేజీ-3లో హౌజింగ్‌బోర్డు కాలనీ మోడల్‌కాలనీగా చేసేందుకు తీర్మానించామని చెప్పారు. త్వరలోనే 24 గంటల మంచినీటి సరఫరాను కాలనీలో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆకుల పద్మ ప్రకాశ్, కోల మాలతి సంపత్, డీఈ అయూబ్‌ఖాన్, గఫర్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర మంత్రి అమిత్‌షాపై చర్య తీసుకోవాలి'

గణేశ్‌నగర్,డిసెంబర్ 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ నిషాని రామచంద్రం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గీత భవన్ వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

●అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి సాగర్ పాల్గొన్నారు.

●అమిత్ షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్ డిమాండ్ చేశారు. మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేదాకా ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

●అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు.

●హుజూరాబాద్: అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలో కాంగ్రెస్, పలు పార్టీల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, బాబు, లావణ్య, శంకర్ పాల్గొన్నారు.

●శంకరపట్నం: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు ఎల్కపల్లి సుధీర్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు.

కొత్తపల్లి మున్సిపాలిటీకి చేంజ్‌మేకర్స్ కన్‌క్లేవ్ అవార్డు

భగత్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మున్సిపాలిటీకి చేంజ్‌మేకర్స్ కన్‌క్లేవ్ అవార్డు దక్కింది. ఢిల్లీలో గురువారం సిల్వర్ హోక్ హాల్‌లో జరిగిన ఛేంజ్ మేకర్స్ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్‌జాయింట్ సెక్రటరీ, నేషనల్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ రూపామిశ్రా చేతుల మీదుగా కొత్తపల్లి మున్సిపాలిటీ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ రమేష్ అవార్డు అందుకున్నారు.

స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించడం సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ చాటినందుకు అవార్డు దక్కిందని మున్సిపల్ ఛైర్మన్ రుద్ర రాజు, కమిషనర్ కట్ల వేణుమాధవ్ తెలిపారు.

ఎమ్మెల్యే గంగుల క్షమాపణ చెప్పాలి

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశించి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని కోవాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించకుండా మంత్రి పొన్నం ప్రభాకర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఫహద్, కరీంనగర్ నియోజకవర్గం అధ్యక్షులు కృపసాగర్, మండల అధ్యక్షులు ప్రశాంత్ పాల్గొన్నారు.

●గణేశ్‌నగర్: ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దిష్టిబొమ్మను నగరంలోని ఇందిరాచౌక్‌లో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో కరీంనగర్ భజన మండలి


భజన యాత్రలో పాల్గొన్న వరాల మైసమ్మ భజన మండలి సభ్యులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) శ్రీశైలంలోని భ్రమరాంభికా మల్లికార్జున స్వామి దేవాలయం భజన యాత్రలో వరాల మైసమ్మ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. రెండుగంటల పాటు తమ భక్తిగీతాలతో భక్తులను అలరించారు. కార్యక్రమంలో భక్తమండలి సభ్యులు కె యాదయ్య, ఎం.సుధాకర్, జి.కమలాకర్, వి.సదానందం, డి.హరిప్రసాద్, ఎన్.శ్రీనివాస్, జె.కుమారస్వామి, వి.నాగేశ్వర్‌రావు, ఎం.మల్లేశం, బి.రమేశ్ పాల్గొన్నారు.

బస్‌స్టేషన్ సిబ్బందితో ఆర్‌ఎం సమీక్షా సమావేశం

భగత్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్‌స్టేషన్ సిబ్బందితో ఆర్‌ఎం రాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కంట్రోలర్‌లు ప్రయాణీకులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు.

ఈ సమావేశంలో కస్టమర్ రిలేషన్స్ మేనేజర్ జి సురేష్, స్టేషన్ మేనేజర్ అంజయ్య, కంట్రోలర్లు జగన్, శంకర్‌రెడ్డి, దొంతరాజయ్య, ఐసిఎస్‌రావు, కొమురయ్య, సిహెచ్‌ఎంరావు తదిదతరులు పాల్గొన్నారు.

కోతలు లేకుండా నిరంతర విద్యుత్

(5వ పేజీ తరువాయి)

మెయింటెనెన్స్ చేయిస్తాం. వాటి సమీపంలో ఉండే చెట్లను తొలగించడంతో పాటు ఎర్తింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ చర్యలతో ట్రాన్స్‌ఫార్మర్లు తరచు మరమ్మతులకు రావడాన్ని నిరోధిస్తాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎన్ని సబ్‌స్టేషన్లు ఉన్నాయి?

ఎస్ఈ : జిల్లాలో పది 132 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. కొత్తగా మూడు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.. వేసవి యాక్షన్ ప్లాన్ కింద 132 కేవీ, 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం.. సబ్ స్టేషన్ల మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు మొట్టమొదటిసారిగా కరీంనగర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్లలో సరఫరా నిలిపివేయకుండా మరమ్మతులు చేపట్టేందుకు ట్రయల్ రన్ నిర్వహించాం. అందులో సక్సెస్ అయ్యాం.. ఇకపై సబ్ స్టేషన్ల మరమ్మతుల పేరిట వి ద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగదు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో కొత్తగా సబ్‌స్టేషన్లు ఏమైనా ఏర్పాటు చేస్తున్నారా?

ఎస్ఈ : ఐదు కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మూడు నెలల్లో అవి అందుబాటులోకి వస్తాయి.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో గృహజ్యోతి పథకం ద్వారా ఎంత మంది లబ్ధి పొందుతున్నారు?

ఎస్ఈ : జిల్లాలో ప్రతినెలా 1,54,629 మంది గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందుతున్నారు. జీరో బిల్ ద్వారా వారు 6.73 కోట్ల రూపాయల సబ్సిడీ పొందుతున్నారు. గృహజ్యోతి పథకం ద్వారా ఇప్పటి వరకు లబ్ధిపొందలేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవో కార్యాలయాల్లో, నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. రేషన్‌కార్డులు ఉన్నవారికే గృహజ్యోతి పథకం వర్తిస్తుంది.

ఆంధ్రజ్యోతి : విద్యుత్‌శాఖలో అవినీతి ఎక్కువైందని, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారనే విమర్శలున్నాయి.. వీటిపై మీ అభిప్రాయం ?

ఎస్ఈ : లంచం ఆశించే అధికారులు, ఉద్యోగులపై, విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఉండే వారిపై నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు. అవినీతి నిరోధక శాఖకు గానీ, టోల్‌ఫ్రీ నంబర్ 1912కుగానీ ఫిర్యాదు చేసేందుకు వీలుంది.

ఆంధ్రజ్యోతి : ప్రజావాణి ఫిర్యాదుల పరిస్థితి ఏమిటి?

ఎస్ఈ : కరీంనగర్ సర్కిల్ పరిధిలో ఆన్‌లైన్ పద్ధతులను పాటిస్తూ పారదర్శకంగా ఉండేలా చూస్తున్నాం. ప్రజావాణి ఫిర్యాదులకు పోర్టల్‌ను ఏర్పాటు చేశాం. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బహిరంగ విచారణ సదస్సులను నిర్వహిస్తున్నాం. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాలు చేపడుతున్నాం. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు మా సిబ్బంది 24/7 అందుబాటులో ఉంటారు.

చదరంగంతో సృజనాత్మకత పెంపు


పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో సృజనాత్మకత పెంపొందుతుందని ఐవీవై పాఠశాల డైరెక్టర్లు మహేష్ పసుల, శ్రీపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐవీవై పాఠశాలలో గురువారం జిల్లాస్థాయి చీఫ్ మినిస్టర్స్ కప్ అండర్-15 చదరంగ పోటీలను వారు డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జనార్దన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జీనియస్ చదరంగ అకాడమీ డైరెక్టర్ అనూప్‌కుమార్, పోటీల నిర్వహణ కన్వీనర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

● సీఎం కప్ సైక్లింగ్ పోటీలు

శాతవాహన యూనివర్సిటీలో జిల్లాస్థాయి రోడ్ సైక్లింగ్ పోటీలను డీవైఎస్‌వో శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ప్రారంభించారు.

వీధి వ్యాపారులను ఇబ్బంది పెట్టకండి

-కరీంనగర్ సీపీని కోరిన కేంద్ర మంత్రి

భగత్‌నగర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో వీధి వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయవద్దని పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్‌లను కేంద్ర హోంశాఖసహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కోరారు. గురువారం నగరంలో వీధి వ్యాపారులు ధర్నా చేస్తున్న విషయాన్ని బీజేపీ నాయకులు ఆయన దృష్టికి తీసుకుపోవడంతో స్పందించి సీపీ, కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మానవతా దృక్పదంతో వ్యవహరించాలని కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి


మాట్లాడుతున్న జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు

సుభాష్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరారు. గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు ప్రకటించాలలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు బెజ్జంకి అంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి, ప్రధానకార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షులు రమేశ్, రవిచంద్ర, బి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. తపస్ రాష్ట్ర కార్యదర్శి వేణుకుమార్ సంఘీభావం తెలిపి ఉద్యమ నిధికి రూ.5వేలు విరాళం అందించారు.

జేడీఎస్ నాయకుల సంఘీభావం

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని గురువారం జనతాదళ్(సెక్యులర్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

పీఆర్టీయూ టీజీ మండల శాఖ నియామకం

సైదాపూర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ తెలంగాణ(పీఆర్టీయూ టీజీ) మండల శాఖను గురువారం నియమించారు. మండలాధ్యక్షుడిగా నెల్లి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా పల్లెర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పోతరవేణి గణేష్, మహిళా కార్యదర్శిగా అస్మాత బస్సుమ్‌లను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డిలు నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా నియామకమైన మండల నూతన కమిటీకి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

డివిజన్‌లోని చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తాం

హుజూరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డివిజన్‌లోని చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందిస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సారెస్పీ పరిధిలో ఉన్నటువంటి రైతులకు జనవరి 1నుంచి సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించిన ప్రణాళికలను అధికారులు రూపొందించారని, ఈ విషయంపై ఇప్పటికే అధికారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వరంగంటి రవికుమార్

జమ్మికుంట, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ అన్నారు. గురువారం జమ్మికుంట మండలంలోని గండ్రపల్లి గ్రామంలో గల సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై పోలీస్‌లు అవగాహన కల్పించారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు కనిపిస్తే పోలీస్‌లకు సమాచారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ రోడ్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని గురువారం వీవీ సేవా సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. వీవీ సేవా సమితి సభ్యులు సాగి వీరభద్రరావు, వెంకట్ రెడ్డి ఉన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చాలి

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): పంబాల కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ పంబాల కులవృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య జ్యూడీషియల్ కమిషన్ చైర్మన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సుద్దాల కుమారస్వామి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల పాండు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల భూపాల్‌రాజు, రాష్ట్ర కోశాధికారి బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

రామడుగు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన పోరాడుతున్న సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని దేశరాజుపల్లి, మోతె, గుండి గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి మాట్లాడారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాల మహానాడు నాయకుల అరెస్టు


హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మాలమహానాడు నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న హుజూరాబాద్ మాల మహానాడు నాయకులను గురువారం ఉదయం ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో బాబు, సతీష్, స్వామి, ప్రవీణ్, నరసింగం, రవి తదితరులున్నారు.

● ఇల్లందకుంట: మండలంలోని మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలమైన నిర్ణయంతో ఉండటాన్ని నిరసిస్తూ గురువారం మాల మహానాడు ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయ కులు మాదాసు మొగిలి తదితరులు పాల్గొన్నారు.

● గంగాధర : మాల జేఏసీ తలపెట్టిన చలో అసెంబ్లీకి తరలివెళ్తున్న మండలంలోని మాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో మాల నాయకులు మాట్లాడుతూ వర్గీకరణను ఇతర రాష్ట్రాలు వ్యతిరేకిస్తుంటే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అనుకూలమని చెప్పడాన్ని ఖండించారు. వర్గీకరణతో మాలలు తీవ్రంగా నష్టపోతారన్నారు. అరెస్టయిన వారిలో గంగాధర, కురిక్యాల, లక్ష్మీదేవిపల్లి, ర్యాలపల్లి మాల మహానాడు నాయకులున్నారు.

అంబేద్కర్‌కు నరేందర్‌రెడ్డి నివాళి

గంగాధర, డిసెంబరు 19: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి గురువారం గంగాధరలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కరీంనగర్ నుంచి వేములవాడకు గంగాధర మీదుగా భారీగా బైక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర ప్రధాన కూడలి మధురానరగ్ చౌరస్తాలో ఆయనకు మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ఒక్క అవకాశమివ్వాలని కోరారు.

పండితుల సమస్యలపై నిరంతర పోరాటం

మానకొండూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ పండిత పరిషత్ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నేరువట్ల చైతన్య అన్నారు. మానకొండూర్‌లో గురువారం మండల ఉపాధ్యాయల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పండిత పరిషత్ ఉపాధ్యాయుల తో పాటు మిగిలిన వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బీజేపీ బూత్ అధ్యక్షుల ఏకగ్రీవ ఎన్నిక

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో గురువారం బూత్ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేశవపట్నంలోని 107వ బూత్ అధ్యక్షుడిగా బొజ్జ కుమార్, మొలంగూర్‌లోని 112వ బూత్ అధ్యక్షుడిగా నాగవెల్లి జగదీష్, 115వ బూత్ అధ్యక్షుడిగా దాసారపు తిరుపతి, గద్దపాకలోని 117వ బూత్ అధ్యక్షుడిగా పొద్దుటూరి వెంకన్న, 126వ బూత్ అధ్యక్షుడిగా రెడ్డి రమణారెడ్డి, 127వ బూత్ అధ్యక్షుడిగా జంగ సతీష్‌లు మండల ఎన్నికలాధికారి ఆకుల రాజేందర్ సమక్షంలో ఎన్నుకున్నారు.

పచ్చునూర్ పాఠశాలను సందర్శించిన డీఈవో

మానకొండూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్‌లో ఇంగ్లీష్ సబ్జెక్టు యూపీ లెవల్ సమావేశాన్ని డీఈవో జనార్దన్ రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి, విద్యార్థులకు వారధిగా పనిచేయాలని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం. మధుసుదనాచారి, ఉపాధ్యాయులు, చంద్రప్రకాష్, దామోదర్‌రెడ్డి, శివ కుమార్, లక్ష్మణ్‌రావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల గురుకుల కళాశాలకు రెండు గీజర్లు అందజేత

చొప్పదండి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల కళాశాలకు రెండు గీజర్లను మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ అందజేశారు. పిల్లలు చలిలో స్నానాలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గీజర్లను అందజేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ తెలిపారు.

● చొప్పదండిలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయ అన్నదాన ట్రస్టుకు పట్టణానికి చెందిన కటకం భూమయ్య, రమాదేవి-మల్లిఖార్జున్, సాయిరాంలు 54,054 రూపాయలను విరాళంగా అందజేశారు. ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

వరి నారు పెరుగుదలలో సమస్యలు


జూపాక గ్రామంలో నారుమడి

గుండ సునీత, ఏడీఏ

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నారు మడులు ఆశించిన విధంగా పెరుగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తీవ్రమైన చలిగాలులతో పాటు, నేలలో జింక్‌లోపం, విత్తనాల సమస్య రైతులను వెంటాడుతున్నాయి. నారుమడుల పెంపకంలో జాగ్రత్తలపై హుజూరాబాద్ ఏడీఏ గుండ సునీత పలు వివరాలు వెల్లడించారు.

నారుమడిలో నీరు తీసివేయడానికి తప్పనిసరిగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. మళ్లలో అసలు నీరు నిల్వ ఉంచరాదు. రెండున్నర గుంటల నారుమడికి 2కిలోల పొటాష్ వేసుకోవాలని తెలిపారు. వరినారు ఆకులు వేసే దశ వచ్చే వరకు నీరు పలుచగా ఉండేలా చూసుకోవాలి. చలి ఎక్కువగా ఉన్నందున ఆకులను ఇటుక పొడిరంగులలో మచ్చలు వస్తాయి. ఈ రంగుల మచ్చలు రాకుండా 2 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి నారుమడికి స్ప్రే చేయాలన్నారు. చిగురాకు తెల్లగా మారితే ఒక లీటరు నీటికి 20 గ్రాములు అన్నాబేడి, 2 గ్రాములు నిమ్మ ఉప్పు కలిపి స్ప్రే చేయాలి. నారు వేసిన పదిరోజులకు కార్బోఫ్యూరాన్, కార్బన్‌ను సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. మంచు కురిస్తే రాత్రిపూట కవర్లు కప్పి ఉదయం తీసివేస్తే సమస్యను అధిగమించవచ్చని ఏడీఏ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

●కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ 41వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ తెలంగాణ కళా రూపాల ప్రదర్శనలతో పాటు గ్రామీణ కళా జ్యోతి అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు గుండ్ర కృపాదానం, కార్యదర్శి సల్వాజి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

●నగరంలోని జెడ్‌పి క్వార్టర్స్‌లోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్పస్వామి తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో 28న పురాణం మహేశ్వరశర్మ వైదిక నిర్వహణలో యాగం జరుగుతుందని పేర్కొన్నారు.

●భగత్‌నగర్: రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు సెయింట్‌జార్జ్ (సిబిఎస్ఈ) విద్యా ర్థులు రిషికేష్, పునీత, తరుణ్‌కుమార్, హాసస్, వర్షిత ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ పాతిమారెడ్డి అభినందించారు.

●కొత్తపల్లి మండలం ఎలగందల్‌లో విధులు నిర్వహిస్తున్న సుజాతను పీఆర్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలిగా నియమిస్తూ పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తర్వులు జారీ చేశారు.

●హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఎక్లెసియా మినిస్ట్రీ రెవరెండ్ డాక్టర్ డి డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి.

● జమ్మికుంట: పట్టణంలోని కృష్ణాకాలనీలో టీబీపై డాక్టర్ చందన ఆరోగ్య అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ అరుణ పాల్గొన్నారు.

● రామడుగు: మండలంలోని మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న కడారి రిష్మిత జిల్లా స్థాయి బయో సైన్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆడెపు మనోజ్‌కుమార్ తెలిపారు.

● ఇల్లందకుంట: మండలానికి చెందిన ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్టు రావుల రాజేశం జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నియామకమయ్యారు.

● రామడుగు: మండల కేంద్రానికి చెందిన ప్రమోద్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా గురువారం ఆల్ ఇండియన్ రెడ్డి సంఘం నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు జయపాల్, నల్ల శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గుర్రం రాజిరెడ్డి ఉన్నారు.